సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 6 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి. మార్కెట్‌కు 624 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



యాలక్కి..రైతుకు లక్కీ

యాలక్కి అరటి..రైతులకు లాభాల తీపి పంచుతోంది. దీంతో జిల్లాలో ఏటికేడు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. 'పురం'లో ఎక్కువగా సాగులో ఉంది.

8లో

గరిష్టం/కనిష్టం
40.2°/22.6°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు చోట్ల వర్షం కురిసింది.

ప్రతి అర్జీ పరిష్కరించాలి

- అర్జీదారుల సౌకర్యార్థమే మడకశిరలో జిల్లా స్థాయి 'స్పందన' : కలెక్టర్ అరుణ్‌బాబు

మడకశిర: 'స్పందన' కార్యక్రమలో అందే అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. అర్జీలు రీఓపెన్ అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం మడకశిరలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా స్థాయి 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ కార్యక్రమం నిర్వహించగా, వివిధ సమస్యలపై 384 అర్జీలు అందాయి. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామితో కలిసి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ ప్రతి అర్జీదారునితో మాట్లాడారు. కొన్ని సమస్యల పరిష్కారానికి అప్పటికప్పుడే సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. 'జగనన్నకు చెబుదాం' అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆర్డీఓలు, తహసీల్దార్ల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఏదైనా అర్జీకి పరిష్కారం చూపించలేకపోతే.. కారణాలను అర్జీదారులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి

అర్జీదారులు వ్యయప్రయాసల కోర్చి జిల్లా కేంద్రానికి రాకూడదన్న ఉద్దేశంతోనే జిల్లాస్థాయి స్పందనను మడకశిరలో నిర్వహించామన్నారు. అనంతరం మండలాల వారీగా రీఓపెన్ అయిన అర్జీలపై సమీక్షించారు. హిందూపురం మున్సిపల్ కమిషనర్, చిలమత్తూరు హౌసింగ్ అధికారులు, ఎంపీడీఓలు గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అదేశించారు. స్పందన అర్జీల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో మండల స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

వైద్యశిబిరం, భోజన సౌకర్యం..

తొలిసారిగా మడకశిరలో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం జరగడంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అర్జీలు ఇవ్వడానికి వచ్చిన ప్రజలు అనారోగ్యానికి గురైతే తక్షణమే వైద్య సేవలు అందించడానికి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అంతే కాకుండా ఎమ్మెల్యే తిప్పేస్వామి అర్జీదారులకు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, సీపీఓ విజయకుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళీశ్వరరెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ విజయకుమార్, డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ ఎంటీ నాయక్, డీసీఓ కృష్ణానాయక్, జిల్లా పరిశ్రమల అధికారి చాంద్‌బాషా, చేనేత జౌళిశాఖ ఏడీ రమేష్, పట్టుపరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రఫీద్‌ఖాన్, డీఆర్ఓ కొండయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామితో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ హితానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

పుట్టపర్తి అర్బన్: సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని 9 మంది తహసీల్దార్లు, 9 మంది డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ అనంతపురం కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే బదిలీ స్థానాల్లో చేరాలని ఆదేశించారు. బుక్కపట్నం తహసీల్దార్ జి. నటరాజ్‌ను కదిరికి, సెలవులో ఉన్న సి.కరుణాకర్‌ను బుక్కపట్నంకు, అగళి తహసీల్దార్ బీఎస్ జిలానిని పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయ డీఏఓగా బదిలీ చేశారు. అలాగే మడకశిర తహసీల్దార్ టి.ఆనంద్‌కుమార్‌ను కలెక్టరేట్‌కు, రొళ్ల తహసీల్దార్ ఆర్ఎన్ హసీనాసుల్తానాను హిందూపురం, అమరాపురం తహసీల్దార్ ఏ.సురేష్‌కుమార్‌ను సోమందేపల్లికి, ఓడీసీలో ఉన్న కే.శ్రీధర్‌ను తలుపులకు, కనగానపల్లిలో ఉన్న పీవీ రమణను పెనుకొండ సబ్‌కలెక్టర్ ఆఫీస్‌కు, సీకేపల్లిలో ఉన్న సుబ్బలక్ష్మమ్మను కదిరి ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. అలాగే మరో 9 మంది డిప్యూటీ తహసీల్దార్లకూ స్థాన చలనం కలిగించారు. అమడగూరులో ఉన్న వి.రెడ్డిశేఖర్‌ను ఓడీ చెరువుకు, బుక్కపట్నంలో ఉన్న భాస్కర్‌రెడ్డిని తాడిమర్రికి, కొత్తచెరువులో ఉన్న వెంకటరెడ్డిని అమడగూరుకు, బుక్కపట్నం సివిల్ సప్లయీస్ డీటీ స్వాతిని కొత్తచెరువుకు, తలుపులలో ఉన్న క్రాంతి కుమార్‌ను నల్లచెరువుకు, చిలమత్తూరులో ఉన్న హనుమంతును పెనుకొండకు బదిలీ చేశారు.

17 వరకు అతిసార నియంత్రణ పక్షోత్సవాలు

మడకశిర రూరల్: ఈ నెల 17వ తేదీ వరకూ గ్రామాల్లో అతిసార నియంత్రణపై ప్రజలను చైతన్య పరచాలని సిబ్బందికి జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ఓపీపై ఆరా తీశారు. అనంతరం అతిసార నియంత్రణ పక్షోత్సవాలను ప్రారంభించారు.

పోలీస్ స్పందనకు 48 పిటీషన్లు

కొత్తచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి వివిధ సమస్యలపై 48 పిటీషన్లు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి ప్రతి పిటీషనర్‌తో స్వయంగా మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్‌హౌస్ ఆఫీసర్‌కు ఫోన్ చేశారు. పోలీస్‌శాఖ పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్పందన ఫిర్యాదుల పట్ల ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, 'దిశ' డీఎస్పీ వరప్రసాద్ పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

క్లుప్తంగా

అగ్నిమాపక కేంద్రం తనిఖీ



గౌరవ వందనం సమర్పిస్తున్న సిబ్బంది

మడకశిరరూరల్: స్థానిక అగ్ని మాపక కేంద్రాన్ని జిల్లా అగ్నిమాపక అధికారి హేమనాథ్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. ఎక్కడైన అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే సమాచారం అందిన తక్షణమే స్పందించాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. అగ్నిమాపక అధికారి విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తమిళనాడు వాసి మృతి



వాహనంలో ఇరుక్కున్న జ్యోతికుమార్ మృతదేహం

నల్లచెరువు: స్థానిక జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో తమిళనాడు వాసి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... తమిళనాడులోని ధర్మపురికి చెందిన జ్యోతి కుమార్ (33), ప్రభాకరన్ అనంతపురంలో నివాసముంటూ చిప్స్ తయారీ, వ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. వ్యాపారరీత్యా తన కల్లుకు వచ్చిన వారు సోమవారం ఉదయం తమ బొలెరో వాహనంలో అనంతపురానికి తిరుగు ప్రయాణమయ్యారు. నల్లచెరువు మండలం దేవిరెడ్డిపల్లి సమీపంలోకి చేరుకోగానే జాతీయ రహదారిపై ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద ముందు వెళుతున్న లారీ స్లో కావడాన్ని గమనించకుండా వేగంగా వెనుక నుంచి ఢీకొన్నారు. ఘటనలో బొలెరో నడుపుతున్న జ్యోతికుమార్ వాహనంలోనే ఇరుక్కుపోయి మృతి చెందాడు. పక్కనే కూర్చొన్న ప్రభాకరన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేఉకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

‘యాలక్కి’.. రైతుకు లక్కీ

యాలక్కి...చూస్తే నోరూరుతుంది. తింటే ఆ మాధుర్యమే వేరు. పైగా మధుమేహ బాధితులకు ఎంతో మేలు చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. అందుకే యాలక్కి అరటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కిలో రూ.60పైనే పలుకుతుండగా, రైతులకూ బాగా గిట్టుబాటు అవుతోంది. అందువల్లే జిల్లాలో ఏటికేడు యాలక్కి అరటిసాగు విస్తీర్ణం పెరుగుతోంది.

- యాలక్కి అరటికి భలే గిరాకీ
- సాగుకు ఆసక్తి చూపుతున్న జిల్లా రైతులు
- ఇప్పటికే 204 ఎకరాల్లో యాలక్కి
- అత్యధికంగా హిందూపురంలో 104 ఎకరాల్లో సాగు
- ఆరోగ్యానికి మంచివి కావడంతో పట్టణాల్లో డిమాండ్
- అధిక ప్రాధాన్యం ఇస్తోన్న మధుమేహ బాధితులు



తోట నుంచి తెచ్చిన యాలక్కి అరటి కాయలు (ఇన్‌సెట్) దుకాణంలో యాలక్కి అరటి పండ్లు

జిల్లాలో యాలక్కి అరటి సాగు వివరాలు

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)
ముదిగుబ్బ	3.5
కనగానపల్లి	5
బత్తలపల్లి	12
సోమందేపల్లి	5.5
గోరంట్ల	3
హిందూపురం	104.66
పరిగి	22.26
లేపాక్షి	20.59
చిలమత్తూరు	21
రొద్దం	3
చెన్నేకొత్తపల్లి	4
మొత్తం	204.51

సాక్షి, పుట్టపర్తి: యాలక్కి అరటికి డిమాండ్ పెరుగుతోంది. ఆరోగ్యానికి మంచివి కావడంతో గిరాకీ బాగా ఉంటోంది. అటు వ్యాపారికీ, ఇటు రైతులకు అధిక ఆదాయం వస్తోంది. దీంతో జిల్లాలో యాలక్కి అరటి సాగుచేసే రైతుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో ఇప్పటికే సుమారు 200పైగా ఎకరాల్లో యాలక్కి అరటి సాగులోకి వచ్చింది. అయినప్పటికీ డిమాండ్ మేరకు వ్యాపారులు కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని మరికొందరు రైతులు కూడా యాలక్కి అరటి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ఉద్యాన శాఖాధికారులు తెలిపారు.

మడకశిరలో ధర తక్కువ..

కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో యాలక్కి అరటికి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో పక్కనే ఉన్న మడకశిర ప్రజలు యాలక్కి అరటి రుచికి అలవాటు పడ్డారు. అందువల్లే మడకశిరలో యాలక్కి అరటి నిత్యం అందుబాటులో ఉంటోంది. జిల్లాలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే మడకశిరలో ధర కూడా తక్కువే. పలువురు వ్యాపారులు కర్ణాటక నుంచి యాలక్కి అరటి దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. మిగతా పండ్ల కంటే యాలక్కి అరటి ఎక్కువగా అమ్మకాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు.

మధుమేహ బాధితుల వినియోగం..

మడకశిర, హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, పెనుకొండ పట్టణాల్లో యాలక్కి అరటి అమ్మకాలు ఎక్కువగా ఉంటున్నాయి. యాలక్కి అరటికి మధుమేహంతో బాధపడే వారు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. మిగతా పండ్లు తినలేని కారణంగా యాలక్కి అరటి పండ్లను కొంటున్నారు. ఫలితంగా పట్టణాల్లో డిమాండ్‌కు అనుగుణంగా వ్యాపారాలు ఊపందుకున్నాయి. కిలోల ప్రకారం అమ్ముడయ్యే యాలక్కి అరటి ధరలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ఉంటున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.50 నుంచి రూ.150 వరకూ పలుకుతోంది.

హిందూపురంలో అధికంగా సాగు..

జిల్లా వ్యాప్తంగా సుమారు 205 ఎకరాల్లో యాలక్కి అరటి సాగులో ఉంది. అందులో ఎక్కువగా హిందూపురం మండల పరిధిలో 105 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఆ తర్వాత పరిగి, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో అధికంగా పంట సాగులో ఉంది. ఇటీవల కాలంలో కనగానపల్లి, ముదిగుబ్బ, బత్తలపల్లి, రొద్దం, చెన్నేకొత్తపల్లి మండలాల రైతులూ యాలక్కి సాగుకు ముందుకు వచ్చారు.

ఎకరాకు రూ.2.50 లక్షల ఆదాయం..

ఎకరా విస్తీర్ణం యాలక్కి అరటి సాగుకు రైతులు 1,300 పిలకలు నాటుతున్నారు. 11 నెలల నుంచి దిగుబడి తీసుకోవచ్చు. పంట కాలం నాలుగు నుంచి ఐదేళ్ల వరకూ ఉంటుంది. ఎకరాకు రూ.80 వేల నుంచి రూ.లక్ష ఖర్చు వస్తోందని రైతులు చెబుతున్నారు. ధరను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకూ ఆదాయం వస్తుందంటున్నారు.

రోజూ 30 కిలోల విక్రయం



నేను 30 ఏళ్లుగా అరటిపండ్ల వ్యాపారం చేస్తున్నా. ఇటీవల యాలక్కి అరటికి గిరాకీ బాగా ఉంది. కిలో రూ.65తో అమ్ముతున్నా. సగటున రోజుకు 30 కిలోల వరకు అమ్ముతాను. పావగడ, హిందూపురం మార్కెట్‌లో కిలో పచ్చి యాలక్కి రూ.20, పండ్లు రూ.40 ధరతో కొనుగోలు చేస్తున్నా. వర్షాకాలం అయితే ఆదాయం బాగానే ఉంటుంది.

– షౌకత్, వ్యాపారి, మడకశిర

మూడు ఎకరాల్లో సాగు చేశా



నేను బోరుబావుల కింద మూడు ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో యాలక్కి రకం అరటి సాగు చేశా. మంచి దిగుబడి వచ్చింది. గత నెలలో టన్ను రూ.45 వేల చొప్పున 20 టన్నులు మార్కెట్లో విక్రయించా. ఖర్చులు పోనూ ఎకరాకు రూ 2.5 లక్షల ఆదాయం వచ్చింది.

– రైతు బాబిరెడ్డి, పెద్దపల్లి, మడకశిర మండలం

అవగాహన కల్పిస్తున్నాం



ఇటీవల యాలక్కి రకం అరటికి డిమాండ్ పెరిగింది. మధుమేహ బాధితులకు మేలు చేస్తుందన్న కారణంతో వినియోగం పెరిగింది. తద్వారా అమ్మకాలూ ఎక్కువయ్యాయి. దీంతో యాలక్కి అరటి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఉద్యాన శాఖ తరఫున రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– చంద్రశేఖర్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి

వృద్ధురాలి బలవన్మరణం



బావిలో తేలుతున్న అక్కమ్మ మృతదేహం

సోమందేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపం చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సోమందేపల్లి మండలం చల్లాపల్లి గ్రామానికి చెందిన నర్సయ్య భార్య అక్కమ్మ (59) శనివారం రాత్రి కుటుంబసభ్యులతో ఘర్షణ పడి ఇల్లు విడిచి వెళ్లిపోయింది. అనంతరం ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం దక్కలేదు. సోమవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో అక్కమ్మ మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారం మేరకు కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వ్యక్తి దుర్మరణం



మృతుడు గోవిందు

రొద్దం: ప్రహరీని ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు...రొద్దంలోని కొత్త ఎస్సీ కాలనీ నివాసి సన్యాసి గోవిందు (43)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. వ్యక్తిగత పనిపై సోమవారం ఉదయం కర్ణాటకలోని కొడిమొడుగుకు వెళ్లిన గోవిందు.. తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆర్.మరువపల్లి పాత చెక్‌పోస్టు వద్ద పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న రైస్ మిల్ ప్రహరీ గోడను ఢీకొన్నాడు. ఘటనలో తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నాగస్వామి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రూ.7.5 లక్షల చోరీ

కొత్తచెరువు: స్థానిక ఓ ఇంట్లో దుండగులు చొరబడి రూ.7.50 లక్షలు అపహరించుకెళ్లారు. ఈ మేరకు ఎస్‌ఐ లింగన్న తెలిపారు. కొత్తచెరువులోని కమ్మపాళ్యంలో నివాసముంటున్న బసప్ప ఇటీవల పొలం అమ్మగా వచ్చిన రూ.16.50 లక్షలను ఇంట్లో భద్రపరచాడు. రెండ్రోజుల క్రితం అందులో రూ.7.50 లక్షలు తక్కువగా ఉండడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్న బసప్ప కుమారుడు కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అసత్య ప్రచారం చేయొద్దు



ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: పార్టీ అధిష్టానం నిర్ణయం తనకు శిరోధార్యమని, ఈ విషయంగా ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన ఫోన్ ద్వారా స్థానిక 'సాక్షి' విలేకరితో మాట్లాడారు. 'వైఎస్సార్‌సీపీ హర్ దిల్‌మే..హమ్‌సబ్ జగన్ కేసాత్' పేరుతో విజయవాడలో ముస్లిం మైనారిటీలు నిర్వహించిన కార్యక్రమానికి తాను హాజరయ్యానన్నారు. అలాగే ఆదివారం మంగళగిరిలో జరిగిన ఓ వివాహ వేడుకలో పాల్గొన్నానన్నారు. ఈ కార్యక్రమాలకు వెళ్తే సీఎం అపాయిమెంట్ కోసం వెళ్లి పడిగాపులు కాస్తున్నట్లుగా ఎల్లో మీడియా ప్రచారం చేయడం బాధాకరమన్నారు. రాజకీయ ఎత్తుగడలో భాగంగానే అసత్యాల ప్రచారానికి తెరలేపారని మండిపడ్డారు. అసెంబ్లీ టిక్కెట్టు కేటాయింపులో పార్టీ అధిష్టానం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాల్సిందేనన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. గురువారం హిందూపురానికి వచ్చి పార్టీ కార్యక్రమాలు కొనసాగించడం జరుగుతుందన్నారు.

రాగి సాగు విస్తీర్ణం పెంపునకు కృషి



జాబ్ మేళా పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు తదితరులు

మడకశిర: జిల్లా వ్యాప్తంగా రాగి సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో ఆయన రాగి సాగు విస్తీర్ణం పెంపుపై నిర్వహించనున్న అవగాహన సదస్సుల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాగి సాగు చేసే విధంగా రైతులను చైతన్యవంతం చేయాలని కోరారు. రాగులు సాగు చేసే రైతులకు ప్రభుత్వమే సబ్సిడీపై విత్తనం అందిస్తుందని, అలాగే క్వింటాల్ రాగులను రూ.3,578 ప్రకారం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా పోస్టర్ల ఆవిష్కరణ: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీ–డాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న హిందూపురంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్లను కలెక్టర్, ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఖయ్యూమ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా స్వీకరించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ మాధవ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిబ్బందితో కలసి పుట్టపర్తిలోని పోలీస్‌పరేడ్ మైదానంలో సోమవారం ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎస్.విష్ణు, ఏఆర్‌డీఎస్పీ విజయ్‌కుమార్, డీఎస్పీ వాసుదేవన్, పుట్టపర్తి రూరల్ సీఐ జయానాయక్, ఆర్‌ఐలు టైటాస్, శ్రీశైలం రెడ్డి, నారాయణ, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

హిందూపురం: ఇంటికి వచ్చిన బాలికపై మేనమామ అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని రహమత్‌పుర ప్రాంతానికి చెందిన ఓ మాంసం వ్యాపారి భార్యకు రెండేళ్ల క్రితం కవలలు జన్మించారు. పిల్లలను చూసుకునేందుకు అప్పుడప్పుడు అదే ప్రాంతంలో నివాసముంటున్న 8వ తరగతి చదువుతున్న తన చెల్లెలు కుమార్తె వచ్చి పోతుండేది. ఈ క్రమంలో తన భార్య నిద్రిస్తున్న సమయంలో ఆ బాలికపై మూడు రోజులుగా మేనమామ అత్యాచారం చేస్తూ వచ్చాడు. విషయాన్ని ఇతరులకు చెబితే చంపేస్తానని బెదిరించడంతో లోలోన మదనపడుతున్న బాలికను గమనించి తల్లి ఆరా తీసింది. దీంతో అసలు విషయం తెలిపి బాలిక బోరున విలపించింది. ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు హిందూపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.